క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ప్రత్యేక దృష్టి



మోపాల్: మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో లింగం నాయక్ సూచించారు. మోపాల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లింగం నాయక్ మాట్లాడుతూ.. మే 13న 45 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది అసౌకర్యాలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, టేబుళ్లు, వీల్ చైర్లు, టెంట్లు, తాగునీటి వసతి, తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. తహసీల్దార్ రామేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోవులను కాపాడటంలో మోదీ సర్కార్ విఫలం



నిజామాబాద్‌నాగారం: గోవులను కాపాడటంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని స్వతంత్ర ఎంపీ అభ్యర్థి కోటగిరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందుత్వం, హిందూ రక్షణ, గోవుల రక్షణ కోసం బీజేపీ పనిచేస్తుందని గొప్పలు చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్నా గోమాత రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను తీసుకురాలేదన్నారు. మోదీ నిరంకుశ వైఖరికి నిరసనగా తాను ఈ పార్లమెంట్ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో నేడు వాణిజ్య శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో 'డిగ్రీ, పీజీ పట్టభద్రుల కేరియర్, ఉన్నత విద్యలో అవకాశాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కోరుట్ల ప్రభుత్వడిగ్రీ కళాశాలతో కలిసి ఒక రోజు జాతీయ వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వడదెబ్బపై అవగాహన



ఇందల్వాయి: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రోగులకు, గర్భిణులకు వడదెబ్బపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓఆర్ఎస్ పాకెట్లను ప్రజలందరు అందుబాటులో ఉంచుకోవాలని, మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లవద్దని సూచించారు. హెచ్ఈవో శంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి సస్పెండ్

ఖలీల్‌వాడి: ఆర్మూర్ పట్టణానికి చెందిన ప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ప్రసాద్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటి నుంచి ప్రసాద్‌కు, కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, ఆయన కాంగ్రెస్ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నామన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ పార్టీ కండువాలు వేసి, బీజేపీలోకి ఆహ్వానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న, మహిళ అధ్యక్షురాలు సవిత, కొత్తూరి సురేష్, జగత్ సింగ్, ఉపాధ్యక్షుడు చిన్ను, సందీప్ గౌడ్ ఉన్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

- నాన్ లేఅవుట్‌లలో రోడ్లు, పార్కు స్థలాలు కబ్జా
- పర్యవేక్షించని అధికారులు



ముబారక్‌నగర్ ప్రాంతంలో నాన్ లేఅవుట్‌లో రోడ్లు కబ్జాచేసి చేపట్టిన నిర్మాణాలు



నిజామాబాద్‌నాగారం: నగరంలో అక్రమ లే–అవుట్‌లు విచ్చలవిడిగా వెలిశాయి. అలాగే కనీస నిబంధనలు పాటించకుండా బిల్డర్లు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

నగరంలోని ముబారక్‌నగర్, మానిక్‌బండార్, న్యాల్‌కల్, నాగారం, గూపన్‌పల్లి తదితర ప్రాంతాల్లో నాన్ లేవుట్ వెంచర్లు కోకొల్లలుగా వెలిశాయి. గతంలో ఆయా ప్రాంతాలు గ్రామపంచాయతీ పరిధిలో ఉండడంతో అప్పటి అధికారులు, సర్పంచ్‌లు కాసులకు కక్కుర్తి పడి నాన్ లేఅవుట్ వెంచర్లకు అనుమతులు ఇచ్చారు. దీంతో కనీస నిబంధనలు పాటించకుండానే బిల్డర్లు వెంచర్లు నిర్మించారు. అంతేకాకుండా ప్లాట్లు చేసి మరీ అమ్మేశారు. కొన్ని ప్రాంతాల్లో పార్కు స్థలాలు సైతం ప్లాట్లుగా చేసి బై నంబర్లు వేసి అమ్మేశారు. రోడ్లు కూడా కబ్జా చేసేశారు. ఏ వెంచర్లలో అయినా రోడ్లు కనీసం 33ఫీట్ల ఉండాలి. కానీ ఎక్కడ చూసినా నాన్ లే అవుట్‌లో 20 నుంచి 25ఫీట్ల వరకు మాత్రమే రోడ్లు ఉన్నాయి. పేదలు, సామాన్యులు ఇళ్ల నిర్మాణాల్లో చిన్నపాటి నిబంధనలు పాటించకుంటే అధికారులు ఆగమేఘాల మీద అక్కడికి వెళ్లి నానా హంగామా చేసి నిర్మాణాలు ఆపివేస్తున్నారు. కానీ పెద్దపెద్ద బిల్డర్లు కనీస నిబంధనలు పాటించకుంటే మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగరంలోని అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై దృష్టిసారించాలని, అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు ఏటీఎంలా మారిన తెలంగాణ

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



ప్రచారం నిర్వహిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: కాంగ్రెస్‌కు తెలంగాణ రాష్ట్రం ఏటీఎంలా మారిందని, ఇక్కడి సొమ్మంతా ఢిల్లీ నాయకులకు దోచిపెడుతున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. నగరంలోని 20వ డివిజన్‌లో మంగళవారం ఆయన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, పనులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదల ఓర్వలేక ఇటలీ కాంగ్రెస్ నాయకులు పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ దొంగ హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీపై బురద చల్లే ప్రయత్నం చేస్తుందని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను బొందపెట్టడం ఖాయమన్నారు. ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, కమలం పువ్వుకు ఓటేసి అరివ్రింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు యెండల సాగర్, కేసు లింగం, బెండ ప్రసాద్, విజయ్, ఓం ప్రకాశ్, గంగామణి, కళావతి, వివిధ సంఘాల పెద్ద మనుషులు పాల్గొన్నారు.

'నిజామాబాద్'లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బాడ్సి, సింగంపల్లి యువకులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని, రాజకీయాల్లో అపార అనుభవమున్న జీవన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బాడ్సి, సింగంపల్లి గ్రామాల్లోని యువకులు పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, అరికెల రాజారెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగం సమక్షంలో మంగళవారం బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధిహామీ కూలి రూ.400లకు పెంచుతామని, పేద కుటుంబంలోని మహిళకు ఏడాదికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజలు చేతి గుర్తు కు ఓటేసి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు జగదీష్, మాజీ ఉపసర్పంచి రవి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, మేడ్చల్ లింగం పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలం పాంగ్రా తాజా మాజీ సర్పంచ్ భీమ్‌సింగ్, పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కంఠేశ్వర్ బైపాస్ వద్ద గల రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు శ్రీనివాసులు, దేవిసింగ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్ట్ కోసం కృషి



జక్రాన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్



సమావేశానికి హాజరైన మహిళలు

- ఎంపీ ధర్మపురి అర్వింద్
- జక్రాన్‌పల్లిలో కార్నర్ మీటింగ్

జక్రాన్‌పల్లి: మండలంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు కోసం తనవంతు కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జక్రాన్‌పల్లిలో కార్నర్ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతోపాటు డ్రైపోర్ట్ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని నిర్మిస్తామన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లో రేషన్ కార్డులు ఇప్పించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తామన్నారు. దేశంలో హిందుత్వం బలపడాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. మోదీ నాయకత్వంలో దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్, నాయకులు కోటపాటి నరసింహ నాయుడు, తిరుపతిరెడ్డి, పద్మారెడ్డి, మోహన్ నాయక్, మహేందర్, రాజేందర్ ఉన్నారు.

డీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం



పెర్కిట్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యాధికారం ధర్మ సమాజ్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి కండెల సుమన్ అన్నా రు. ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సుమన్ మాట్లాడుతూ.. బహుజనులందరూ ధర్మ సమాజ్ పా ర్టీకి అనుకూలంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్, నాయకులు కాన్షీరాం తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి





నగరంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు.. తూంపల్లిలో..

నిజామాబాద్‌నాగారం: కోటగల్లిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మంగళవారం బార్ అసోసియేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆయన పోరాటాలను కొనియాడారు. సుదర్శన్‌రావు, బీమర్తి రవి, బొట్టు వెంకటేశ్, రాపెల్లి శ్రీనివాస్, మోహన్, రామాగౌడ్, ప్రియా, తదితరులున్నారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని గడ్కోల్, తూంపల్లి గ్రామాల్లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వేర్వేరుగా అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు భాస్కర్, గంగారెడ్డి, రామకృష్ణ, దామోదర్, రమేష్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



గడ్కోల్ గ్రామంలో..

పొలిటికల్ కార్నర్

ప్రచార పర్వం

జోరుగా కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం



డిచ్‌పల్లి: మండలంలోని సాంపల్లి, సుద్దపల్లి గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి, కూలీలతో మాట్లాడారు. ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మాయమాటలను నమ్మవద్దని సూచించారు. మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, నాయకులు అంతరెడ్డి మోహన్‌రెడ్డి, నర్సయ్య, శ్యాంసన్, ధర్మాగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొరట్‌పల్లి, సుద్దులం, కొరట్‌పల్లి తండా గ్రామాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కే.నగేష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రాంచందర్‌గౌడ్, కంచెట్టి గంగాధర్, షాదుల్లా, జహుర్, సాయారెడ్డి, సురేందర్, శ్రీనివాస్, చిన్నారెడ్డి, గంగారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్, తాళ్లరామడుగు గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. నాయకులు గడీల రాములు, బాకారం రవి, సంతోష్, సతీష్, గంగారెడ్డి, దేవేందర్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతివ్వండి



సిరికొండ: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి, పార్టీ అభ్యర్థి అర్వింద్‌ను గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం మండలంలోని తూంపల్లి, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి, గోపి, బాబురావు, గంగామురళి, రాజు, గోవింద్, రాజేంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఎం ప్రచారం



ఖలీల్‌వాడి: నగరపరిధిలోని అర్సపల్లిలో మంగళవారం సీపీఎం పార్టీ, న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. నాయకులు సిర్ప లింగం, రాములు, నరసయ్య, సుజాత, సూరి, మహేష్, వెంకటేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే దళిత బహుజనుల మద్దతు





నగరంలో అభివాదం చేస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు.. డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే దళిత బహుజనుల మద్దతు ఉంటుందని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి చెన్నయ్య పేర్కొన్నారు. దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లను కాపాడుకోవాలన్నా, మన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నా కేంద్రంలో బీజేపీని గద్దె దించాలని అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డినీ భారీ మెజారిటీతో గెలిపించాలని దళిత బహుజనులకు తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీల చట్టాన్ని అవమానించడంతో పాటు రాజ్యాంగాన్ని మారుస్తాం అన్న బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఓటమికి మాలలంతా విస్తృత ప్రచారం చేయాలన్నారు. బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నె శ్రీధర్ రావు, మోహన్ రావు, నీరడి రవి, దేవేందర్, సూర్య కాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల మద్దతు జీవన్‌రెడ్డికే..

డిచ్‌పల్లి: తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఆదేశాల మేరకు యావత్ మాదిగ జాతి మద్దతు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఉంటుందని జిల్లా అధ్యక్షుడు గుండారం మోహన్ మాదిగ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్, ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికల్లో కూడా మాదిగల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో బీజేపీ నీచమైన రాజకీయాలు చేస్తుందని, 400 పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బహిరంగంగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మల్లమరి సుధాకర్, సామదాన, కొండ్ర చిన్న సాయిలు, నాయకులు సూర్యపాల్, సునీల్, సాయికుమార్, సాయిలు, పద్మ, నర్సింహులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన జెడ్పీటీసీ సుమన



సుభాష్‌నగర్: జిల్లాకేంద్రంలో మంగళవారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఇందల్వాయి జెడ్పీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గడ్డం సుమనారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పరిస్థితిపై ఆయనకు క్లుప్తంగా వివరించారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

నిజామాబాద్‌అర్బన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా మందకృష్ణ మాదిగ బుధవారం నగరానికి రానున్నట్లు ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జి సరికెల పోశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆర్మూర్ విజయలక్ష్మీగార్డెన్‌లో నేడు నిర్వహించనున్న సభకు ఆయన హాజరు కానున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నాయకులు సభకు తరలిరావాలని ఆయన కోరారు.

21వ ప్యాకేజీ ద్వారా సాగునీరు అందిస్తా

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజక వర్గానికి 21వ ప్యాకేజీ ద్వారా సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని శాసనమండలి సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏడాదిలోగా ప్యాకేజీ పనులను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాల్సిన బాధ్యత తనదేనని అన్నారు. జక్రాన్‌పల్లి మండలంలో యువతకు ఎక్కువగా ఉపాధి కలిగేలా, ఎయిర్‌పోర్టుతో పాటు డ్రైపోర్టు నిర్మాణం చేపడతామన్నారు. అదేవిధంగా మండలానికి ముఖ్యమైన గుత్ప ఎత్తిపోతల అదనపు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని తెలిపారు. బోధన్, మెట్‌పల్లిలో చక్కర కర్మాగారాన్ని తెరిపిస్తామని అన్నారు. బీడీ కార్మికులకు ఎలాంటి కటాఫ్ లేకుండా రూ.4వేలు అందజేస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో చేతు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు అనంత్‌రెడ్డి, నర్సారెడ్డి, గోర్త రాజేందర్, అప్పాల రాజన్న, మద్దుల రమేష్,వినోద్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	71,000	వెండి (కిలో)	84,500
22 క్యారెట్స్	65,490		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	40	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	20	50
జిర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	60	80
వంకాయ	30	60	బీట్‌రూట్	25	50
పాలకూర	25	50	కరివేపాకు	60	80
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	75	చిక్కుడుకాయ	50	75
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు)-1.30, 4.30,7.30,10.30
స్క్రీన్-2	బాక్(తెలుగు)-10.40, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)-4.45, 7.50, ప్రసన్న వదనం (తెలుగు)-7.30, 10.30
స్క్రీన్-3	బాక్ (తెలుగు) - 1.40, 4.35, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 1.35, 7.45, టిల్లు స్క్వేర్(తెలుగు) - 4.30 బాక్ (తెలుగు) - 10.40
స్క్రీన్-2	ది ఫల్ గై (ఇంగ్లీష్) - 11.00, 1.50, 7.20, 10.10, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3 డీ-తెలుగు)-4.40
స్క్రీన్-3	ప్రసన్నవదనం (తెలుగు) - 1.10,4.15, 10.10, శబరి (తెలుగు)-7.20
స్క్రీన్ -4	బాక్(తెలుగు)-1.10, మంజుమ్మల్‌బాయ్స్ (తెలుగు)- 4.20, 7.35, 10.30
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	బాక్ తెలుగు)
లలితామహల్	వకీల్‌సాబ్(తెలుగు)
విజయ్	ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు)